సాక్షి
హనుమకొండ
గురువారం । 24 । జూలై । 2025



బొగత.. జలసవ్వళ్లు

ములుగు జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వాజేడు మండలం చీకుపల్లి సమీపంలోని సహజసిద్ధ బొగత జలపాతం పరవళ్లు తొక్కుతోంది. కాగా, జలపాతం ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తుండడంతో తాత్కాలికంగా పర్యాటకుల సందర్శనను నిలిపివేసినట్లు ములుగు డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ తెలిపారు. - వాజేడు

న్యూస్‌రీల్

భద్రకాళి ఆలయ హుండీ ఆదాయం రూ.88,41,510



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో బుధవారం హుండీ లెక్కించారు. మూడు నెలల 22 రోజులకుగాను రూ.88,41,510 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ శేషు భారతి తెలిపారు. విదేశీ కరెన్సీ 581, యూఎస్ఏ డాలర్లు, 20 యూఏ దిరమ్స్, 25 కెనడా డాలర్లు, 11 ఖతర్ సెంట్రల్ బ్యాంక్ రియాల్స్, 20 యూరోలు, 13 మలేషియా రింగెట్స్, 10 ఆస్ట్రేలియా డాలర్లు, 10 నేపాల్ రూపాయలు లభించినట్లు తెలిపారు. నగదును యూనియన్ బ్యాంకులో జమ చేసినట్లు పేర్కొన్నారు. లెక్కింపునకు పర్యవేక్షణాధికారిగా దేవాదాయశాఖ పరిశీలకులు ధరణి కోట అనిల్‌కుమార్ వ్యవహరించారు. ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు, పర్యవేక్షకులు అద్దంకి విజయ్‌కుమార్‌తోపాటు ఆలయ సిబ్బంది, దేవాలయ చైర్మన్ డాక్టర్ బండారు శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు వీరన్న, సుగుణ, మయూరి, స్రవంతి, పూర్ణచందర్, సతీశ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి శ్రీనివాస సేవా ట్రస్ట్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సభ్యులు, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి అధ్యక్షులు నవీన్, సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు.

కేయూ పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో పీజీ కోర్సుల ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఎల్ఐఎస్సీ, ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్ఆర్ఎం తదితర కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి సౌజన్య తెలిపారు. ఈనెల 25, 28, 30, ఆగస్టు 1, 4, 6 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ పరిధిలో 24 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 4,628 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వారు తెలిపారు. పూర్తి వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

పాఠశాలల్లో లైబ్రరీలను బలోపేతం చేయాలి




విద్యారణ్యపురి: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని లైబ్రరీలను బలోపేతం చేయాలని వరంగల్ జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ సుజన్ తేజ కోరారు. బుధవారం వరంగల్ జిల్లాలోని 44 స్కూల్ కాంప్లెక్స్ పరిధి పాఠశాలల్లో ఇద్దరి చొప్పున 88 మంది రిసోర్స్‌పర్సన్లకు పాఠశాల స్థాయిలో లైబ్రరీల బలోపేతానికి ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని శంభునిపేట పాఠశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుజన్ తేజ మాట్లాడుతూ.. ప్రతీ రోజు కొంత సమయం కేటాయించి గ్రంథాలయంలోని పుస్తకాలను చదివేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. శిక్షణలో కో–ఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు, హెచ్‌ఎం శారదాబాయి, డీఆర్పీలు శైలజ, అశోక్, ఎస్ఆర్పీ కుమారస్వామి, సీఆర్పీలు రాధాకృష్ణ, అనిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విమానాశ్రయాలు త్వరగా నిర్మించాలి



హన్మకొండ: వరంగల్, కొత్తగూడెంలో విమానాశ్రయాల నిర్మాణాలు త్వరగా మొదలు పెట్టాలని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ బుధవారం ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. కేంద్ర ప్రభుత్వం విమానాశ్రయాలు నిర్మించేందుకు చిత్తశుద్ధితో ఉందని తెలిపినట్లు సీతారాం నాయక్ చెప్పారు. కొత్తగూడెం విమానాశ్రయంపై రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, సరైన ప్రదేశాన్ని ప్రభుత్వం ఇవ్వలేదని, వరంగల్ విమానాశ్రయానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని మంత్రి చెప్పినట్లు వివరించారు. డీపీఆర్ మేరకు 800 ఎకరాలు కేటాయించాల్సి ఉండగా.. 600 ఎకరాలు మాత్రమే కేటాయించారని.. మిగతా కేటాయిస్తే వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారన్నారు.

వేయిస్తంభాల ఆలయంలో మాస శివరాత్రి పూజలు



కల్యాణం అనంతరం రుద్రేశ్వరి, రుద్రేశ్వరస్వామి

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో ఆషాఢ బహుళ త్రయోదశి యుక్త చతుర్దశి బుధవారం మాస శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, శివ కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితుడు మణికంఠశర్మ, అర్చకుడు ప్రణవ్, సందీప్‌శర్మ ఉదయం 5 గంటల నుంచి ప్రభాతసేవ, ఉత్తిష్ట గణపతికి, శ్రీరుద్రేశ్వరస్వామికి పంచామృత రుద్రాభిషేకం, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ నాట్య మండపంలో రుద్రేశ్వరీదేవి, రుద్రేశ్వరస్వామివారిని ప్రతిష్టించి కల్యాణోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దేవాలయాన్ని సందర్శించారు.

జర్నలిజం విభాగంలో వివాదం

రెమ్యునరేషన్ బిల్లులు ఇవ్వడం లేదని పార్ట్‌టైం అధ్యాపకుల ఫిర్యాదు

- కేయూ వర్సిటీ ప్రిన్సిపాల్ లేఖతో కమిటీ నియామకం
- రెండు సార్లు విచారణ జరిపిన కమిటీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో రెమ్యునరేషన్ బిల్లుల వివాదం నడుస్తోంది. తమకు బిల్లులు ఇవ్వడం లేదని పార్ట్‌టైం అధ్యాపకులు యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేయగా, గత మే నెలలో వీసీ ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ వి.రామచంద్రం ఓ కమిటీని నియమించారు. ఆ కమిటీ బుధవారం జర్నలిజం విభాగాన్ని సందర్శించి రెండోసారి విచారణ జరిపింది.

2012నుంచి కొనసాగుతున్న ఎస్ఎఫ్‌సీ

జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ కోర్సు (ఎస్ఎఫ్‌సీ) 2012నుంచి కొనసాగుతోంది. ప్రస్తుతం ఇన్‌చార్జ్ విభాగం అధిపతిగా డాక్టర్ సంగని మల్లేశ్వర్ కొనసాగుతున్నారు. కేయూ రిజిస్ట్రార్ ఉత్తర్వుల మేరకు గత విద్యాసంవత్సరం వరకు ఆరుగురు పార్ట్‌టైం అధ్యాపకులు కొనసాగినట్లు సమాచారం. ఈ విద్యా సంవత్సరానికి ఇంకా పార్ట్‌టైం అధ్యాపకులకు ఉత్తర్వులు ఇవ్వలేదని తెలిసింది.

కమిటీ పరిశీలించాల్సిన అంశాలు ఇవీ..

జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ విభాగంలో పార్ట్‌టైం బోధన ఏర్పాట్లు ,ప్రథమ, ద్వితీయ సెమిస్టర్ల పాఠ్యాంశాల్లో పునరావృతం, పార్ట్‌టైం అధ్యాపకులకు బోధనా బాధ్యతల కేటాయింపుపై కమిటీ విచారణ జరపాలి.

రెండోసారి విచారణ జరిపిన కమిటీ..

జర్నలిజం విభాగంలో పలు అంశాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఓ కమిటీని నియమించారు. ఆ కమిటీ చైర్మన్‌గా జియాలజీ విభాగం ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ బి.సురేష్‌లాల్, సోషియాలజీ విభాగం ప్రొఫెసర్ కుంట ఐలయ్య సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ కొద్దిరోజుల క్రితం ఒకసారి విచారణ జరిపింది. తాజాగా రెండోసారి బుధవారం పార్ట్‌టైం అధ్యాపకులు, విద్యార్థులు, ఇన్‌చార్జ్ విభాగం అధిపతిగా ఉన్న సంగని మల్లేశ్వర్‌ను విచారణ జరిపారు. సుమారు నాలుగు గంటలపాటు విచారణ సాగింది. విద్యార్థులు తమ సమస్యలను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. పార్ట్‌టైం అధ్యాపకులు మాత్రం తమకు ఐదేళ్లనుంచి ఇప్పటివరకు రెమ్యునరేషన్ బిల్లులు ఇవ్వడం లేదని కమిటీ దృష్టికి తీసుకెళ్లారని సమాచారం. ఎందుకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని మల్లేశ్వర్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది. పార్ట్‌టైం అధ్యాపకుల నియామకానికి అప్పటి యూనివర్సిటీ అధికారులు ఉత్తర్వులు ఇవ్వడంలో జాప్యం చేశారని కమిటీకి తెలియజేసినట్లు సమాచారం. విచారణ ముగిసిందని, కమిటీ నివేదికను కొద్దిరోజుల్లో యూనివర్సిటీ అధికారులకు ఇవ్వనుందని సమాచారం. ఆ నివేదికను బట్టి యూనివర్సిటీ అధికారుల నిర్ణయం ఎలా ఉంటుందో చూడాల్సి ఉంటుంది.



కేయూలోని జర్నలిజం విభాగం

ఆ విభాగంలో అసలేం జరుగుతోంది?

కమిటీ నియామకంతో జర్నలిజం విభాగంలో అసలేం జరుగుతుందన్న చర్చ యూనివర్సిటీలో జరుగుతోంది. విద్యార్థులు కొందరు సరిగా క్లాస్‌లకు రాకపోవడం.. పలువురు పార్ట్‌టైం అధ్యాపకులు కూడా తరగతులు తీసుకోకపోవటం లాంటివి చోటుచేసుకున్నాయనేది కొద్దిరోజుల క్రితం యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ టి.మనోహర్ దృష్టికి వచ్చింది. ఈ క్రమంలో 2021–2022 విద్యాసంవత్సరానికి సంబంధించిన పార్ట్‌టైం అధ్యాపకుల రెమ్యునరేషన్ బిల్లులు ఆడిట్‌లో పాస్ అయి యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ వద్దకు కొన్నినెలల క్రితం వచ్చాయి. దీంతో ఆయన ఆ విభాగానికి వెళ్లి అప్పటి పార్ట్‌టైం అధ్యాపకుల అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించగా పలువురు అధ్యాపకులు పీరియడ్‌లు తీసుకున్నట్లు పెట్టిన బిల్లులకు అనుగుణంగా అటెండర్ రిజిస్టర్‌లో కొన్ని సంతకాలు లేవని గుర్తించారు. కొన్ని పీరియడ్‌లు తీసుకోకున్నా బిల్లులు మాత్రం తీసుకున్నట్లుగా పెట్టినట్లు గుర్తించిన మనోహర్ ఆ రెమ్యునరేషన్ బిల్లులను చెల్లించకుండా నిలిపివేశారు. పాతబిల్లులు చెల్లించవద్దని కొంతకాలం క్రితం యూనివర్సిటీ అధికారులు మౌఖికంగా తెలియజేసిన దాని ప్రకారం ఈ బిల్లులు చెల్లించాలా.. వద్దా అనేది యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పలు అంశాలకు సంబంధించి ఓ లేఖను కూడా అందజేశారు. 2022- 2023, 2023-2024, 2024-2025 పార్ట్‌టైం అధ్యాపకుల బిల్లులు కూడా ఇప్పటివరకు యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ వద్దకు రాలేదు. కాకతీయ యూనివర్సిటీ పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ (కుప్లా) ఇచ్చిన వినతి, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ మనోహర్ ఇచ్చిన లేఖతో గత మే నెలలోనే విచారణ కమిటీని నియమించారు. ఈ విషయం బయటికి తెలియకుండా జాగ్రత్త పడడం గమనార్హం.

కలెక్టర్ విస్తృత తనిఖీలు

- కేజీబీవీలో స్పెషల్ ఆఫీసర్‌కు షోకాజ్ నోటీస్
- భూ–భారతి దరఖాస్తుల పరిశీలన వేగవంతానికి ఆదేశం



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్, పక్కన డీఈఓ వాసంతి

హసన్‌పర్తి: హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం హసన్‌పర్తి మండలంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. హసన్‌పర్తిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 300 మంది విద్యార్థినులు ఒకేసారి భోజనం కోసం క్యూలో నిలబడడంపై స్పెషల్ ఆఫీసర్ స్వప్నను ప్రశ్నించారు. కూరగాయలతో పాటు స్పోర్ట్స్ మెటీరియల్ స్టాక్ రిజిస్టర్లు అందుబాటులో లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. స్పెషల్ ఆఫీసర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీఈఓ వాసంతికి సూచించారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆమె వెంట డీఈఓ వాసంతి, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు. రెవెన్యూ కార్యాలయంలో భూ–భారతి దరఖాస్తుల పరిశీలనను వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తిరస్కరించిన దరఖాస్తులకు కారణాలు తెలుసుకున్నారు. భూ–భారతిలో చేపడుతున్న రిజిస్ట్రేషన్ తీరును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చల్లా ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ రహీం, ఆర్ఐలు ఫాజిల్, రాజేంద్రప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కుమార్ పాల్గొన్నారు.

సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అన్నారు. హసన్‌పర్తిలోని ఆస్పత్రిని తనిఖీ చేసి రోగులతో మాట్లాడారు. ఫార్మసీ విభాగంలో మందుల నిల్వలు, సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. ఆపరేషన్ థియేటర్ పనిచేయక మూడేళ్లవుతోందని, మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని స్థానికుడు వీసం సురేందర్‌రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. హసన్‌పర్తిలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సెంటర్‌ను నగరానికి తరలించారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాగా, రెండేళ్ల పాటు ఇక్కడ పనిచేసినప్పటికీ వేతనాలు ఇవ్వలేదని ఓ మహిళ.. కలెక్టర్ ఎదుట వాపోయింది. గతంలో ఆస్పత్రి డెవలప్‌మెంట్ ఫండ్ కింది వేతనాలు అందించామని, ఇప్పుడు ఆనిధులు నిలిపేసినట్లు డీఎంహెచ్‌ఓ అప్పయ్య తెలిపారు. అలాంటప్పుడు ఆమెతో ఎందుకు పనిచేయించుకున్నారని కలెక్టర్ ప్రశ్నించారు. కార్యక్రమంలో వైద్యాధికారి భార్గవ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూరియా డెఫ్ విక్రయ కేంద్రం ఆకస్మిక తనిఖీ



వల్భాపూర్‌లో యూరియా డెఫ్ తనిఖీ చేసిన డీఏఓ రవీందర్‌సింగ్

ఎల్కతుర్తి: ఎల్కతుర్తి మండలంలోని వల్భాపూర్‌లోని యూరియా డెఫ్ విక్రయ కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్, సహాయ సంచాలకులు ఆదిరెడ్డి, మండల అధికారి రాజ్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా డెఫ్ తయారీలో సబ్సిడీ యూరియా వాడుతున్నారన్న సమాచారంతో అందులో పనిచేసే గుమాస్తాను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విచారించగా.. రాజస్తాన్‌లో తయారు చేసి ఇక్కడికి తెచ్చి అమ్ముతున్నట్లు విచారణలో తేలినట్లు అధికారులు తెలిపారు. ఇందులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భరత్, ఏఎస్సై ఉబెదుల్ల పాల్గొన్నారు.

అధికారుల తప్పిదం.. నిలువ నీడ కరువు

- ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పొరపాటు
- ఉన్న ఇంటిని కూల్చేసుకున్న కుటుంబం



కోగిల్వాయిలో రవి-సునీత కూల్చేసుకున్న ఇల్లు

దామెర: అధికారుల తప్పిదంతో ఓ కుటుంబానికి నిలువ నీడ కరువై రోడ్డు పడిన పరిస్థితి. దామెర మండలం కోగిల్వాయి గ్రామానికి చెందిన పోటు రవి–సునీత దంపతులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్లు అధికారులు ప్రొసీడింగ్ కాపీ అందజేశారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యదర్శి సరళ ఆధ్వర్యంలో వారు నివాసం ఉంటున్న రేకుల షెడ్డు కూల్చేసి పనులు ప్రారంభించారు. పిల్లర్ గుంతల పనులు నిర్వహిస్తుండగా, ఆన్‌లైన్‌లో జరిగిన తప్పిదంతో వేరే వారికి మంజూరు కావాల్సిన ఇల్లు రవి సునీతకు మంజూరైనట్లు జారీ చేశామని, వారికి ఇచ్చిన మంజూరు పత్రాలను అధికారులు వెనక్కి తీసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ అధికారులు చెప్పిన మాటలు నమ్మి ఉన్న రేకుల షెడ్డును కూల్చి రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సరళను వివరణ కోరగా.. గ్రామంలో ఒకే రకమైన పేర్లు ఉండడం వల్ల పొరపాటున ఒకరికి బదులు మరొకరికి ఇల్లు మంజూరైందని పత్రాలు అందజేసినట్లు తెలిపారు. రెండో విడతలో వీరికి కూడా ఇల్లు మంజూరు చేసి న్యాయం చేస్తామన్నారు.

చాడ సరిత సేవలు మరువలేనివి



చాడ సరిత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్ తదితరులు

వేలేరు: బీఆర్ఎస్ పార్టీకి మాజీ జెడ్పీటీసీ చాడ సరిత అందించిన సేవలు మరువలేనివని మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్ అన్నారు. చాడ సరిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నాయకులు బుధవారం మల్లికుదుర్లలోని ఆమె నివాసానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, శంకర్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు రాకేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తుది విడత పాలిసెట్ కౌన్సెలింగ్

రామన్నపేట: టీజీ పాలిసెట్–2025 డిప్లొమా కోర్సుల తుది విడత వెబ్ కౌన్సెలింగ్ రాష్ట్ర వ్యాప్తంగా నేటి (గురువారం) నుంచి ప్రారంభం కానుంది. ఈమేరకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, వరంగల్ టీజీ పాలిసెట్ హెల్ప్‌లైన్ సెంటర్ క్యాంప్ ఆఫీసర్ బైరి ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈకౌన్సెలింగ్‌లో మొదటి విడతలో సీటు పొందిన అభ్యర్థులు కూడా అవసరమైతే తిరిగి ఆప్షన్లు ఇవ్వొచ్చని పేర్కొన్నారు. మొదటి విడతలో కౌన్సెలింగ్‌కు హాజరుకాని అభ్యర్థులు, తుది విడతకు కొత్తగా స్లాట్ బుక్ చేసుకుని ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావొచ్చని సూచించారు. వరంగల్ పాలిసెట్ హెల్ప్ లైన్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ప్రక్రియకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పాలిసెట్ తుది విడతలో సీటు పొందిన విద్యార్థులకు ఇంటర్నల్ స్లైడింగ్ ద్వారా అదే కళాశాలలో ఇతర బ్రాంచ్‌కు మారేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు ఆగస్టు 2, 3వ తేదీల్లో వెబ్ ఆప్షన్ల ఎంపిక, 5న స్లైడింగ్ సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. సీట్లు మిగిలితే ఆగస్టు 5 నుంచి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ http://tgpolycet.nic.in ను సంప్రదించాలని సూచించారు.

‘మహాలక్ష్మి’తో మహిళా సాధికారత

- రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ
- వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో సంబురాలు



కేక్ కట్ చేస్తున్న మంత్రి సురేఖ, మేయర్ సుధారాణి, కలెక్టర్ సత్యశారద, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

వరంగల్ చౌరస్తా: మహాలక్ష్మి పథకంతో మహిళా సాధికారత సిద్ధిస్తుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో బుధవారం మహాలక్ష్మి పథకం సంబురాలు నిర్వహించారు. మేయర్ గుండు సుధారాణి, వరంగల్ కలెక్టర్ సత్య శారద, గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి కేక్ కట్ చేశారు. వ్యాసరచన, రంగోళి పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మహిళా స్వయం సహాయక సంఘాలు స్టాళ్లను పరిశీలించి, ఐదు అద్దె బస్సుల తాళాలను మహిళా సంఘాల ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంతో ప్రతి మహిళ ముఖంలో చిరునవ్వు కనిపిస్తోందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో మహిళలకు అసలైన గౌరవం దక్కుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో 15.43 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి రూ.690 కోట్లు ఆదా చేసుకున్నట్లు తెలిపారు. దేవాదాయ శాఖకు రూ.170 కోట్ల ఆదాయం పెరిగిందన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్ చింతాకుల అనిల్, డీఆర్డీఓ కౌసల్యాదేవి, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్, డిపో మేనేజర్, ధరంసింగ్, తహసీల్దార్ ఇక్బాల్, మెప్మా డీఎంసీ రేణుక, టీఎంసీ రమేశ్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీల దగ్గరకు వెళ్లడం లేదు..

ఆరోగ్యం దెబ్బతింటే గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఆర్ఎంపీలను సంప్రదిస్తే వారు రూ.200, రూ.300 ఫీజు తీసుకుంటున్నారని మంత్రి మాట్లాడడం చర్చనీయాంశమైంది. ఆర్ఎంపీల దగ్గరకు వెళ్లకుండా ఉచిత బస్సు ప్రయాణంతో వరంగల్ ఎంజీఎం, హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెద్ద ఆపరేషన్లు చేయించుకుంటూ ఆరోగ్యంగా ఉంటున్నారని పేర్కొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం..

సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కొండా సురేఖ అన్నారు. గ్రేటర్ 12వ డివిజన్ దేశాయిపేట ఎస్సీ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు కలెక్టర్ సత్య శారద, గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్ కావేటి కవితతో కలిసి శంకుస్థాపన చేశారు. లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను మంత్రి అందజేశారు. కమ్యూనిటీ హాళ్లకు బదులు మ్యారేజ్ హాళ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. ఏసీపీ శుభం, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు, కార్పొరేటర్ కుమార్ పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో మాస శివరాత్రి పూజలు



రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు

ఐనవోలు: మల్లికార్జునస్వామి ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని బుధవారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, స్వామి వారి కల్యాణం, రుద్రహోమం, ఒగ్గు పూజారులచే పెద్ద పట్నం వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అర్చకుడు మధుకర్ శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు సిబ్బంది పాల్గొన్నట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు.

మోస్తరు నుంచి భారీ వర్షం



హనుమకొండ జిల్లా గ్రంథాలయం ఎదుట నిలిచిన వర్షపు నీరు

హన్మకొండ: జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బుధవారం రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంది. రుతుపవన ద్రోణి, బంగాళా ఖాతం ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా.. మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపిన క్రమంలో.. రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటి వరకు వర్షాభావ పరిస్థితులు నెలకొని రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈవర్షంతోనైనా చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం 8.30 నుంచి బుధవారం ఉదయం 8.30 వరకు నమోదైన వర్షపాతం వివరాలను వాతావరణ శాఖ విడుదల చేసింది. హనుమకొండ జిల్లాలో సగటున 40.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బుధవారం ఉదయం 8.30 నుంచి రాత్రి 7 గంటల వరకు నడికూడలో 17 మిల్లీమీటర్ల వర్షం, దామెర మండలం పులుకుర్తిలో 16.5, శాయంపేటలో 16.3, కమలాపూర్‌లో 15, పరకాలలో 14.8, ఆత్మకూరులో 13, కమలాపూర్ మండలం మరిపల్లిగూడెంలో 10.3, హసన్‌పర్తి నాగారంలో 6.8, భీమదేవరపల్లిలో 6.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అత్యధికంగా భీమదేవరపల్లిలో..

జిల్లాలో అత్యధికంగా భీమదేవరపల్లిలో 128.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వేలేరులో 56, ఎల్కతుర్తిలో 28.3, కమలాపూర్‌లో 31.6, హసన్‌పర్తిలో 16.8, ధర్మసాగర్‌లో 28.7, కాజీపేటలో 18.6, హనుమకొండలో 17.4, ఐనవోలులో 19.1, పరకాలలో 55.1, దామెరలో 24.6. ఆత్మకూరులో 43, శాయంపేటలో 60, నడికూడలో 36.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

క్లుప్తంగా

నేడు ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ, వరంగల్ బాక్సింగ్ అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి పి. రాజేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు జనవరి 01, 2011 నుంచి డిసెంబర్ 31, 2012 తేదీలోపు జన్మించి ఉండాలన్నారు. క్రీడాకారులు తమ ఆధార్, పాఠశాల స్టడీ సర్టిఫికెట్, మున్సిపల్ ధ్రువీకరించిన జనన ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఉదయం 7.30 గంటలకు బాక్సింగ్‌హాల్ వద్ద రిపోర్టు చేయాలని సూచించారు. ఇందులో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు హైదరాబాద్‌లోని షేక్‌పేట్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు 99597 11609 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా దానయ్య



హన్మకొండ: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బక్క దానయ్య ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో హనుమకొండ జిల్లా హనుమకొండ రూరల్ సబ్ డివిజన్ ఏడీఈ బక్క దానయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, సహకరించిన అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెపల్లి మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై బుధవారం హనుమకొండకు చేరుకున్న బక్క దానయ్యకు ఆ అసోసియేషన్ నాయకులు రౌతు రమేశ్ కుమార్, స్వదేశ్, చలపతి, కుమారస్వామి, కృష్ణ, కుమారస్వామి, రాజయ్య, జడల రవి, తదితరులు స్వాగతం పలికారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం



హన్మకొండ అర్బన్: రక్తదాన కార్యక్రమాలతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయమని హనుమకొండ కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు స్నేహ శబరీష్ కొనియాడారు. సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీలోని జనరిక్ మందుల షాప్, టైలరింగ్ శిక్షణ కేంద్రం, తలసేమియా సెంటర్‌ను బుధవారం సందర్శించి పిల్లలతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. తలసేమియా బాధితులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా 30 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ అభివృద్ధి తన వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు కలెక్టర్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ విజయచందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు శ్రీనివాస్‌రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు వేణుగోపాల్, శేషుమాధవ్, శ్రీనివాస్‌రావు, సుధాకర్‌రెడ్డి, జయశ్రీ, రమణారెడ్డి, హనుమకొండ డీఎంహెచ్‌ఓ అప్పయ్య, జిల్లా టీబీ నివారణాధికారి డాక్టర్ హిమబిందు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రావణం..శుభకరం

రేపటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం



గర్భగుడిలో లక్షపత్రిపూజ చేస్తున్న భక్తులు(ఫైల్)

- ఆగస్టు 23వ తేదీ వరకు ప్రత్యేక పూజలు
- కాళేశ్వరం గర్భగుడిలో ప్రత్యేకంగా లక్షపత్రి పూజలు, అభిషేకాలు
- తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి రానున్న భక్తులు

కాళేశ్వరం: శ్రావణం..సకలం శుభకరం. చేపట్టిన ప్రతీ కార్యం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. మహాశివుడికి ప్రీతికరణమైన శ్రావణ మాసం శుక్రవారం నుంచి ప్రారంభమై ఆగస్టు 23వ తేదీన ముగుస్తుంది. ఈ సందర్భంగా భక్తజనం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి వారి ఆలయంలో శివనామ స్మరణ మార్మోగనుంది. కాళేశ్వరాలయానికి తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి నెలరోజుల పాటు నిత్యం వేల సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

లక్షపత్రి పూజ ప్రత్యేకం..



శ్రావణమాసంలో కాళేశ్వరాలయంలో లక్షపత్రి పూజకు ప్రత్యేకత ఉంది. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రతీ రోజు సాయంత్రం వేళల్లో బిల్వ దళాలతో 'లక్షపత్రి పూజ' చేసి మహాశివుడిని పూజిస్తారు. స్వయంగా గర్భగుడిలో ద్విలింగాల స్పర్శ దర్శనం ఉండడంతో భక్తులు ఆసక్తి చూపుతారు. జంటకు(దంపతులు) టికెట్ ధర రూ.8 వేలుగా నిర్ణయించారు. ఒక రోజు ఐదు గురికి మాత్రమే ఈ పూజ నిర్వహిస్తారు. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్ జరుగుతుండగా, బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేశారు. ఇదివరకు లక్షపత్రి పూజ టికెట్‌కు రూ.6వేలు ధర ఉండగా, ప్రస్తుతం పెరిగిన నేపథ్యంలో భక్తులకు భారం కానుంది. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామివార్లకు భక్తులు అత్యధికంగా రూ.వెయ్యి టికెట్ చెల్లించి అభిషేక పూజలు నిర్వహిస్తారు. కాళేశ్వరం దేవస్థాన అనుబంధ దేవాలయాలైన శ్రీశుభానందాదేవి(పార్వతి), శ్రీసరస్వతీ అమ్మవార్ల ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేస్తారు. పార్వతి అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు అత్యధికంగా నిర్వహిస్తారు. ఉసిరిచెట్టు వద్ద లక్షవత్తులు వెలిగిస్తారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేస్తారు. ఉపవాసదీక్షలు చేస్తారు. మహిళలు వరలక్ష్మీవ్రతం నిర్వహిస్తారు. నెలపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది.

దేవతారాధన చేయాలి..



శ్రావణమాసం నెలరోజుల పాటు దేవతామూర్తులకు పూజలు నిర్వహిస్తే మంచిది. దేవతారాధన చేయొచ్చు. శ్రావణమాసం శుభకార్యాలకు అనుకూలం. లక్షపత్రి పూజలు నిర్వహిస్తే మహాశివుడి కరుణతోపాటు ముక్తి లభిస్తుంది. భక్తులు ఎక్కువ లక్షపత్రి పూజలపై ఆసక్తి చూపుతారు. కాళేశ్వరంలో ద్విలింగాలకు లక్షపత్రి పూజచేస్తే స్వామివారి మోక్షం లభిస్తుంది.

– పనకంటి ఫణీంద్రశర్మ, ఉపప్రధాన అర్చకుడు, కాళేశ్వరం దేవస్థానం

కల్యాణ వైభోగమే..



- 25 నుంచి పెళ్లి సందడి మరూ..
- తలంబ్రాలకు వేళాయె

కాజీపేట: మరో రెండు రోజుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఈనెల 25న శ్రావణ మాసం మొదలు.. నవంబర్ చివరి వరకు పెళ్లి సందడి నెలకొననుంది. దీంతో బంగారు ఆభరణాలు, దుస్తుల దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా మారనున్నాయి. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో ఉన్న ఫంక్షన్ హాళ్లు అడ్వాన్స్ బుక్ అయ్యాయి. దాదాపు 6 వేల వరకు పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉందని పురోహితుల అంచనా. కాగా జీవితంలో ఒకేసారి జరిగే వేడుక అనే కారణంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు కూడా వివాహాలకు భారీగా ఖర్చు చేస్తున్నారు. సగటున ఒక్కో పెళ్లికి రూ.10లక్షలకు తగ్గకుండా ఖర్చు చేస్తున్నారు.

పెళ్లి ముహూర్తాలు..



- జూలై నెలలో 26, 30, 31
- ఆగస్టులో 1,3,5,7,8,9,10,11,12,13,14,17
- సెప్టెంబర్‌లో 24, 26, 27, 28
- అక్టోబర్‌లో 1,2,3,4,8,10,11,12,22,24,29,30,31
- నవంబర్‌లో 1,2,7,8,12.13,15,22,23,26,27,29,30వ

తేదీల్లో పెళ్లిళ్లు జరగనున్నాయి. కాగా, భాద్రపద మాసం ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 21వ తేదీ వరకు పెళ్లిళ్లకు ముహూర్తాలు లేవని కాజీపేట అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రధాన అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ 'సాక్షి'కి తెలిపారు.

25 నుంచి రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బ్యాడ్మింటన్ పోటీలు

- నేడు క్వాలిఫైయింగ్ రౌండ్స్
- 20 జిల్లాల నుంచి 190 మంది క్రీడాకారులు..



టోర్నమెంట్ వివరాలు వెల్లడిస్తున్న జితేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జిల్లా వేదికగా మూడు రోజులు జరగనున్న 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ (అండర్–17) బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మూల జితేందర్‌రెడ్డి, డాక్టర్ కొమ్ము రాజేందర్ తెలిపారు. ఈమేరకు బుధవారం హనుమకొండలోని వరంగల్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చాంపియన్‌షిప్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు వరంగల్ క్లబ్, భీమారంలోని కిట్స్ కళాశాల ఇండోర్ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులు జరగనున్న పోటీలకు ముందు నేడు(గురువారం) క్రీడాకారులకు క్వాలిఫైయింగ్ రౌండ్స్ నిర్వహించి ప్రతిభ ఆధారంగా మెయిన్ జట్లలోకి తీసుకుంటామన్నారు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ కేటగిరీల్లో జరిగే పోటీలకు తెలంగాణలోని 20 జిల్లాల నుంచి 190 మంది క్రీడాకారులు హాజరవుతున్నారన్నారు. వరంగల్ క్లబ్‌లో 25న జరిగే పోటీలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. 27వ తేదీన నిర్వహించే ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి , గౌరవ అతిథులుగా ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, మాస్టర్స్ ఇంటర్నేషనల్ క్రీడాకారుడు శశిధర్ హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారన్నారు. సమావేశంలో వరంగల్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పింగిళి రమేశ్ రెడ్డి, కోశాధికారి నాగకిషన్, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

18 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ ఏఎస్పీ శుభం

వరంగల్ చౌరస్తా: వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానాస్పద వ్యక్తుల నుంచి 18 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసినట్లు వరంగల్ డివిజన్ ఏఎస్పీ శుభం తెలిపారు. బుధవారం ఇంతేజార్ గంజ్ పోలీస్‌స్టేషన్‌లో వారిని ప్రవేశపెట్టి ఏఎస్పీ వివరాలు వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ పోలీసులు వరంగల్ రైల్వే స్టేషన్ ఏరియాలో పెట్రోల్ చేస్తుండగా రవి టిఫిన్ సెంటర్ ఎదుట ఒక స్త్రీ, ఒక పురుషుడు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులు వారి బ్యాగులను తనిఖీ చేయగా.. సుమారు 18 కిలోల ఎండు గంజాయి నాలుగు బ్యాగుల్లో లభించింది. వివరాలు ఆరా తీయగా.. ఒడిశా రాష్ట్రం గణపతి జిల్లా కట్టంగుమాకు చెందిన జులియం బెహరా(60) జులియం కుమారి బెహర(55) దంపతులని తెలిసింది. వీరు గతంలో కూలి పని చేస్తూ స్వగ్రామంలోనే జీవించేవారు. కూలి గిట్టుబాటు కావడం లేదని, గంజాయి వ్యాపారం చేస్తే ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని నిర్ణయించుకున్నారు. ఒడిశాలోని ఓ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి వద్ద సుమారు 18 కిలోల ఎండు గంజాయిని తీసుకుని సోలాపూర్ వెళ్లి అక్కడ రూ.50 వేలకు కిలో చొప్పున అమ్మేందుకు నిర్ణయించుకున్నారు. సోలాపూర్ వెళ్లేందుకు జనరల్ బోగిలో టికెట్ లేకుండా ప్రయాణించారు. టీటీ తనిఖీ చేస్తుండగా.. బ్యాగులతో కలిసి ఇద్దరూ టీ తాగేందుకు రైలు దిగారు. ట్రైన్ వెళ్లిపోయాక కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించేందుకు వేచి చూస్తున్నారు. ఈక్రమంలో పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించి తనిఖీ చేయగా.. వారి నుంచి గంజాయి లభించింది. భార్యాభర్తలను అరెస్ట్ చేసి వరంగల్ కోర్టులో హాజరు పర్చినట్లు వరంగల్ ఏఎస్పీ శుభం తెలిపారు. కార్యక్రమంలో సీఐ షుఖూర్, ఎస్‌ఐలు నీలోజు వెంకటేశ్వర్లు, తేజ, ఏఎస్‌ఐ భిక్షపతి, సిబ్బంది ఉన్నారు.

మహిళలకు ప్రభుత్వం పెద్దపీట

- హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేశ్



మహిళా ప్రయాణికులను సన్మానిస్తున్న ఆర్డీఓ రమేశ్‌రాథోడ్, ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం కేశరాజు భానుకిరణ్

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్ద పేట వేస్తోందని హనుమకొండ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ రాథోడ్ రమేశ్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్‌లో వరంగల్–1 డిపో ఆధ్వర్యంలో మహాలక్ష్మి సంబురాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా మహిళా ప్రయాణికులను సన్మానించి జ్ఞాపికలు అందించారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు ఆర్డీఓ రమేశ్ రాథోడ్ బహుమతులు అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్లు, కండక్టర్లు ఓపిక, సహనంతో విధులు నిర్వహిస్తుండడంతో ఈ పథకం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం కేశరాజు భానుకిరణ్ మాట్లాడుతూ.. వరంగల్ రీజియన్‌లో ఇప్పటి వరకు 15.43 కోట్ల మహిళలు ప్రయాణించినట్లు తెలిపారు. ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ పుప్పాల హరిత, అసిస్టెంట్ మేనేజర్లు సీహెచ్ సంతోశ్‌కుమార్, అమల, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కీర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ ఎకరాకు సాగు నీరందిస్తాం..



పూలు వేసి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, చిత్రంలో ఎమ్మెల్యే నాగరాజు

ధర్మసాగర్: దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా నియోజకవర్గంలోని ప్రతీ ఎకరానికి సాగు నీరందిస్తామని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం పంట పొలాలకు నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ధర్మసాగర్ రిజర్వాయర్ సౌత్ కెనాల్ కింద 12 డిస్ట్రిబ్యూటరీల ద్వారా 1.6 లక్షల ఎకరాలకు నీరందనున్నట్లు తెలిపారు. ఈకెనాల్ ద్వారా ధర్మసాగర్, ఐనవోలు, జఫర్‌గఢ్, హసన్‌పర్తి మండలాలకు సాగు నీరందనున్నట్లు పేర్కొన్నారు. ఈఏడాది తెలంగాణ వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, ఇప్పటి వరకు సరైన వర్షపాతం నమోదు కాలేదన్నారు. రైతులు నార్లు పోసుకుని వర్షం కోసం ఎదురు చూస్తున్నారని, నాట్లు వేసుకునేందుకు సాగు నీరు అందించడానికి నీటిని విడుదల చెసినట్లు తెలిపారు. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పంటల్ని కాపాడే బాధ్యత ప్రభుత్వానిదేనని హామీ ఇచ్చారు. కాలువల ద్వారా వచ్చే నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంటలను కాపాడేందుకు ఆన్, ఆఫ్ పద్ధతిలో పది రోజుల పాటు నీటిని విడుదల చేసి మరో పది రోజులు నీటి విడుదల ఆపనున్నట్లు వెల్లడించారు. ఇలా పంటలకు సాగు నీరందిస్తామని ఇందుకు రైతులు సహకరించాలన్నారు. నీటి పారుదల శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

స్పెషల్ సీఎస్‌ను కలిసిన ఎమ్మెల్యేలు



సీఎస్ రంజన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు శ్రీహరి, రాజేందర్‌రెడ్డి, నాగరాజు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్‌లో రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటుపై బుధవారం హైదరాబాద్ టూరిజం ప్లాజాలోని తెలంగాణ స్పోర్ట్స్, యూత్ సర్వీసెస్ ఆఫీస్‌లో స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్‌ను ఎమ్మెల్యేలు కలిశారు. స్పోర్ట్స్ స్కూల్‌ను ప్రారంభించేందుకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన సీఎస్ ఆగస్టు 15న స్పోర్ట్స్ స్కూల్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యేలు తెలిపారు. సీఎస్‌ను కలిసిన ఎమ్మెల్యేల్లో కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోతు అశోక్‌కుమార్ ఉన్నారు.

జల సవ్వడి..



భీమునిపాదం జలపాతం వద్ద పర్యాటకుల కేరింతలు

జాలువారుతున్న జలపాతాలు

- కనువిందు చేస్తున్న భీమునిపాదం, పాండవులు, వంకమడుగు వాటర్ ఫాల్స్
- పర్యాటకుల సందడి..

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప అడవిలోని భీమునిపాద జలపాతం బుధవారం జాలువారుతూ చూపరులను కనువిందు చేసింది. కొన్ని రోజుల నుంచి మోస్తరు వర్షం కురుస్తుండగా, ఆదివారం నుంచి ఆ జలపాతం జాలువారడం ప్రారంభమైంది. రెండు రోజులుగా రాత్రి సమయాల్లో భారీ వర్షం కురువడంతో జలపాతం భారీగా జాలువారుతూ సమీపంలోని భీమునిపాదం చెరువులోకి ప్రవహించింది. దీంతో పర్యాటకులు వివిధ వాహనాల ద్వారా చేరుకుని జలపాతంలో స్నానం చేస్తూ సందడి చేశారు. కాగా, మొదటి సారి ఎత్తైన గుట్టల నడుమ నుంచి భీమునిపాదంగా పిలిచే ప్రదేశం నుంచి జలపాతం జాలువారడంతో పచ్చని అటవీ ప్రాంతం పర్యాటకులను ఆకర్షిస్తోంది.

జలపాతాలకు తరలొస్తున్న పర్యాటకులు



పాలనురగలా దుంకుతున్న చింతోనిగుంపు జలపాతం

బయ్యారం: భారీ వర్షాలకు మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం బయ్యారం పెద్దగుట్టపై ఉన్న పాండవుల జలపాతంతో పాటు చింతోనిగుంపు సమీపంలోని వంకమడుగు జలపాతం చూపరులను కనువిందు చేస్తున్నాయి. జాలువారుతున్న జలపాతం అందాలకు పలువురు ఫిదా అవుతున్నారు. ఈ జలపాతాల అందాలు తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలొస్తున్నారు.

26 వరకు 'బొగత' సందర్శన నిలిపివేత



వాజేడు: పహారా కాస్తున్న సిబ్బంది

వాజేడు: అటవీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఈ నెల 26వ తేదీ వరకు బొగత జలపాతం సందర్శన నిలిపివేసినట్లు ములుగు డీఎఫ్‌ఓ కిషన్ జాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ముత్యంధార, కొంగర, మామిడి లొద్ది, కృష్ణపురం జలపాతాలను పర్యాటకుల భద్రతాకారణాల దృష్ట్యా శాశ్వతంగా మూసివేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో సందర్శకులు ఇటు వైపు వెళ్లొదని సూచించారు. అటవీ అధికారులు హెచ్చరికలు బేఖాతర్ చేసిన వారిపై పోలీసు కేసు నమోదు చేస్తామని తెలిపారు.

సిబ్బంది పహారా.. గేటుకు తాళం

బొగత జలపాతం సందర్శనను నిలిపి వేసిన అధికారులు జాతీయ రహదారి నుంచి జలపాతానికి వెళ్లే దారికి అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేసి సిబ్బంది కాపలా ఉన్నారు. అదే సమయంలో జలపాతం ప్రధాన ద్వారానికి తాళం వేశారు. కాగా, కొందరు పర్యాటకులు గుమ్మడి దొడ్డి వైపు నుంచి జలపాతం వద్దకు వచ్చి నీటిలో దిగుతున్నారు. వరద ఉధృతంగా ఉందని బొగతకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నా కొందరు మాత్రం దొంగ దారిలో జలపాతానికి వెళ్తున్నారు.

వాగు దాటించి.. వైద్యం అందించి

- గర్భిణిని వాగు దాటించి ఆస్పత్రికి తరలించిన వైద్యసిబ్బంది



కృష్ణవేణిని ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం నర్సాపూర్ వాగు మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో బుధవారం మండలంలోని అల్లిగూడెం గ్రామానికి చెందిన గర్భిణి గుమ్మడి కృష్ణవేణికి పురిటినొప్పులు రావడంతో ఆశ వర్కర్ కొడిశాల పీహెచ్‌సీ వైద్యాధికారి పవన్‌కు సమాచారం అందించారు. దీంతో పవన్.. హెల్త్ సూపర్‌వైజర్ బాలు, హెల్త్ అసిస్టెంట్ సీతారాంనాయక్‌ను అప్రమత్తం చేశారు. దీంతో వారు వెంటనే గ్రామస్తుల సాయంతో నడుంలోతు వరద నుంచి కృష్ణవేణిని ఎత్తుకుని వాగు దాటించారు. అనంతరం ట్రాక్టర్‌లో పోచాపూర్ వరకు తీసుకొచ్చి అక్కడి నుంచి అంబులెన్స్‌లో ములుగు ప్రభుత్వ సివిల్ ఆస్పత్రికి తరలించినట్లు సిబ్బంది తెలిపారు. కాగా, సకాలంలో అప్రమత్తమై స్పందించి గర్భిణి కృష్ణవేణిని వాగు దాటించిన వైద్యాధికారులు, సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

రెవెన్యూ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: రెవెన్యూ వసూళ్లు, బకాయిలపై నోడల్ జనరల్ మేనేజర్లు ప్రత్యేక దృష్టి సారించాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లు, సీజీఎంలు, నోడల్ జీఎంల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లులు చెల్లించని సర్వీసులపై దృష్టి సారించి వాటిని రాబట్టుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీసీ ఐపాస్ సర్వీసుల రిలీజ్ వేగవంతం చేయాలన్నారు. కొత్త సబ్ స్టేషన్ పనులను విధిగా తనిఖీలు చేపట్టాలన్నారు. రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ పనులు, ఫాల్ట్ ప్యాసేజీ ఇండికేటర్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. భారీవర్షాల నేపథ్యంలో అప్రమతంగా ఉండాలని, ఎక్కడ అంతరాయాలు ఏర్పడినా వెంటనే పునరుద్ధరించేలా మెన్, మెటీరియల్ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డైరెక్టర్లు వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, వి.మోహన్ రావు, సి.ప్రభాకర్, సీఈలు టి.సదర్ లాల్, బి.అశోక్ కుమార్, కె.తిరుమల్ రావు, రాజు చౌహాన్, అశోక్, రవీంద్రనాథ్, ఆర్.చరణ్ దాస్, మాధవరావు, వెంకటరమణ, జాయింట్ సెక్రటరీ కె.రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నేరస్తుడికి యావజ్జీవ కారాగార శిక్ష



వరంగల్ లీగల్ : బాలిక (8 సంవత్సరాలు)పై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో నేరస్తుడు గీసుకొండ మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన పసునూరి ఐలయ్యకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.25 వేల జరిమానా విధిస్తూ వరంగల్ పోక్సో కోర్టు జడ్జి మనీషా శ్రావణ్ ఉన్నవ్ బుధవారం సంచలన తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.బృందాదేవి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలిక 2021, జూన్ 28న సాయంత్రం నీరు తీసుకురావడానికి గ్రామంలోని దుర్గమ్మ గుడి వద్ద గల వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్లింది. ఒంటరిగా ఉన్న బాలికను అటుగా వెళ్తున్న అదే గ్రామానికి చెందిన పసునూరి ఐలయ్య తన వెంట చెరువు వద్దకు తీసుకెళ్లాడు. దీనిని గ్రామస్తులతోపాటు బాలిక బంధువు గుగులోత్ రాజు చూసి తల్లికి చెప్పాడు. దీంతో తల్లి వెళ్లి చూడగా గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులతో పాటు తన కూతురు ఉంది. ఏం జరిగిందని అడగగా పసునూరి ఐలయ్య మీ అమ్మాయిని తీసుకుని వస్తుండటాన్ని తాము చూశామని, కాసేపటికి అమ్మాయి కేకలు వినిపించడంతో తాము పరిగెత్తుకుంటూ వచ్చామన్నారు. ఐలయ్య తమను చూసి పారిపోయాడని చెప్పారు. అనంతరం బాధిత బాలిక తన పట్ల ఐలయ్య వ్యవహరించిన తీరును తల్లికి తెలిపింది. దీంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు.. నేరం రుజువుకావడంతో ఐపీసీ సెక్షన్ 376, 366 కింద ఐలయ్యకు పదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా, బాలికపై లైంగిక దాడి (పోక్సో చట్టం) సెక్షన్ 5, ఆర్/డబ్ల్యూ 6 చట్టం కింద యావజ్జీవ కారాగార శిక్ష (జీవించినంత కాలం), రూ.20 వేల జరిమానా విధిస్తూ జడ్జి మనీషా శ్రావణ్ ఉన్నవ్ తీర్పులో పేర్కొన్నారు. బాధిత బాలికకు పరిహార చెల్లింపు పథకం కింద రూ.7 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ జడ్జి తీర్పులో పేర్కొన్నారు.